తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
ఆదివారం
29 మార్చి 2026
సంపుటి 03
సంచిక 170
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com



## ప్రపంచ యుద్ధం ముంగిట పశ్చిమాసియా

- 10 లక్షల మంది సైన్యంతో ఇరాన్ సమరశంఖం
- అమెరికా హెచ్చరికలతో గల్ఫ్ దేశాలలో పెరిగిన ఉత్కంఠ
- హార్ముజ్ జలసంధిని మూసివేసిన ఇరాన్ విప్లవ దళాలు
- భారత్ వంటి మిత్ర దేశాల నౌకలకు మాత్రమే అనుమతి
- అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ ఎదురుదాడులు

**డెస్క్, మార్చి 28 (తరంగాలు ప్రతినిధి):** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింతగా ముసురుకుంటున్నాయి. అమెరికా మరియు ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై భూతల దాడులకు సిద్ధమవుతున్నాయన్న నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో, ఇరాన్ ప్రభుత్వం తన సైనిక శక్తిని సర్వసన్నద్ధం చేసింది. దాదాపు పది లక్షల మందికి పైగా సైనికులను మరియు స్వచ్ఛంద విప్లవ దళాలను సరిహద్దుల్లో మోహరించినట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. అమెరికా గనుక ఇరాన్ గడ్డపై అడుగుపెడితే ఆ ప్రాంతాన్ని నరకప్రాయం చేస్తామని ఆ దేశ సైనిక నాయకత్వం హెచ్చరించింది. ఈ పరిణామం అంతర్జాతీయంగా పెను కలకలాన్ని రేపుతోంది, తద్వారా మూడవ ప్రపంచ యుద్ధం దిశగా అడుగులు పడుతున్నాయా అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రపంచ ఇంధన వాణిజ్యానికి అత్యంత కీలకమైన

➤ మిగతా 2వ పేజిలో..

# లోన్ యాప్ వేధింపులకు ఎంబీఏ విద్యార్థి బలి

- తెలుగు రాష్ట్రాల్లో ఆందోళన
- ఆన్‌లైన్ రుణాల ఉచ్చులో చిక్కుకుంటున్న యువత
- వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడిన మహమ్మద్ బషీర్
- గండేపల్లి మండలంలో విషాదం - పోలీసుల దర్యాప్తు ముమ్మరం




**డెస్క్, మార్చి 28 (తరంగాలు ప్రతినిధి):** ఆధునిక సమాజంలో సాంకేతికత అందిస్తున్న వెసులుబాట్లు కొందరి పాలిట శాపంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఆన్‌లైన్ లోన్ యాప్‌ల వేధింపులు తెలుగు రాష్ట్రాల్లో సామాన్యుల ప్రాణాలను హరిస్తున్నాయి. తాజాగా కాకినాడ జిల్లాలో ఒక యువకుడు లోన్ యాప్ నిర్వాహకుల ఒత్తిడిని భరించలేక తన నిండు నూరేళ్ల జీవితాన్ని అర్థాంతరంగా ముగించాడు. విద్యాబుద్ధులు నేర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన ఒక ఎంబీఏ విద్యార్థి, అప్పుల ఊబిలో చిక్కుకుని బలవన్మరణానికి పాల్పడటం ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో బాధితుడి కుటుంబంలో పెను విషాదం నెలకొంది.?అనకాపల్లి జిల్లా వడ్డాదిమాడుగుల గ్రామానికి చెందిన మహమ్మద్ బషీర్ (22) కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తన ఉజ్వల భవిష్యత్తు కోసం కలలు కంటూ విద్యాభ్యాసం చేస్తున్న క్రమంలో, వ్యక్తిగత అవసరాల నిమిత్తం కొన్నాళ్ల క్రితం ఒక ఆన్‌లైన్ లోన్ యాప్ ద్వారా కొంత రుణం తీసుకున్నాడు. అయితే తీసుకున్న అప్పును గడువులోగా తిరిగి చెల్లించలేకపోవడంతో, లోన్ యాప్ నిర్వాహకులు అతడిని మానసిక వేదనకు గురిచేయడం మొదలుపెట్టారు. గతంలోనూ హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఈ ఉదంతం మరోసారి భయాందోళనలను పెంచింది.?లోన్ రికవరీ ఏజెంట్లు బషీర్‌కు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, అతడి కాంటాక్ట్ లిస్టులో ఉన్న స్నేహితులకు మరియు బంధువులకు మార్ఫింగ్ చేసిన ఫోటోలు పంపుతామని బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పుకోలేక, బయట ఎవరికీ వివరించలేక బషీర్ తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. చివరకు ఈ వేధింపులు భరించలేని స్థాయికి చేరుకోవడంతో,

➤ మిగతా 2వ పేజిలో..

## సమస్య పరిష్కారం వరకు ఉద్యమం కొనసాగిస్తాం



- బోయినపల్లి మార్కెట్ దుస్థితిపై ఈటెల రాజేందర్ ఆగ్రహం
- శాశ్వత పరిష్కారం వరకు ధర్నా హెచ్చరిక
- చెత్తతో నిండిన మార్కెట్ యార్డ్‌పై తీవ్ర విమర్శలు
- కాంట్రాక్టర్లకు చెల్లింపులేక పనులు నిలిచిపోయిన పరిస్థితి

**హైదరాబాద్, మార్చి 28 (తరంగాలు ప్రతినిధి):** మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ బోయినపల్లి వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలించి అక్కడి రైతులు, కార్మికులు, వ్యాపారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ దుస్థితిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకప్పుడు ఆదర్శంగా నిలిచిన ఈ మార్కెట్ ప్రస్తుతం చెత్తతో నిండిన డంప్ యార్డ్‌లా మారిందని ఆరోపించారు.సుమారు 24 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ మార్కెట్‌కు రోజుకు దాదాపు 10 వేల మంది కస్టమర్లు వస్తారని, సంవత్సరానికి 14 నుంచి 15 కోట్ల రూపాయల ఆదాయం వచ్చే ప్రాధాన్యత కలిగిన కేంద్రం అని పేర్కొన్నారు. అయితే గత 9 నెలలుగా చెత్త తరలింపు

➤ మిగతా 2వ పేజిలో..



## మూసీ నది ప్రక్షాళన ఆగదు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వ దీక్ష...
- చారిత్రక పుణ్యక్షేత్రాల పునర్నిర్మాణానికి శ్రీకారం
- పురాతన ఆలయాల అభివృద్ధికి భారీ ప్రణాళికలు
- పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా మారనున్న పరీవాహక ప్రాంతం

➤ మిగతా 2వ పేజిలో..



## అంగన్‌వాడీ వ్యవస్థలో సమగ్ర మార్పులకు శ్రీకారం

- మూడేళ్లలో సొంత భవనాల లక్ష్యం
- చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభం
- పోషకాహారం--ఆరోగ్యంపై ప్రభుత్వ దృష్టి

**హైదరాబాద్, మార్చి 28 (తరంగాలు ప్రతినిధి):** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి దిశగా కీలక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, అన్ని కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల స్థానంలో, వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రం సొంత భవనాల్లోనే కార్యకలాపాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం

➤ మిగతా 2వ పేజిలో..

## ఎల్బీ స్టేడియంలో క్రీడల సందడి



- లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం
- 'ఫిట్ లీడర్స్ -- ఫిట్ స్టేట్" సందేశంతో ఉత్సాహభరిత ప్రారంభం
- 14 ఏళ్ల తర్వాత పునఃప్రారంభమైన క్రీడా సంప్రదాయం
- అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రణాళికలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 28(తరంగాలు ప్రతినిధి):** హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఎల్‌బీ స్టేడియంలో "తెలంగాణ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్, కల్చరల్ మీట్" తొలి ఎడిషన్ ఘనంగా ప్రారంభమైంది. "ఫిట్ లీడర్స్ -- ఫిట్ స్టేట్" అనే సందేశంతో ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటారు. బడ్జెట్

➤ మిగతా 2వ పేజిలో..

## జేవర్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం

- ప్రధానమంత్రి చేతుల మీదుగా ఘన ప్రారంభం
- విమానయాన రంగంలో కొత్త దశ
- ఆసియాలో అతిపెద్ద ప్రాజెక్ట్‌గా జేవర్ గుర్తింపు
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌కు గ్లోబల్ కనెక్టివిటీ హబ్ లక్ష్యం

**నోయిడా, మార్చి 28 (తరంగాలు ప్రతినిధి):** ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంత అభివృద్ధి చరిత్రలో మరో కీలక ఘట్టం నమోదైంది. జేవర్‌లో నిర్మించిన రెండో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనంగా ప్రారంభించారు. దేశాన్ని "వికసిత్ భారత్" దిశగా తీసుకెళ్లే ప్రణాళికలో భాగంగా ఈ విమానాశ్రయం కీలక మౌలిక వసతిగా నిలుస్తుందని ప్రభుత్వం పేర్కొంది. పెరుగుతున్న విమాన ప్రయాణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని

➤ మిగతా 2వ పేజిలో..



# లోన్ యాప్ వేధింపులకు ఎంబీఏ విద్యార్థి బలి

➢ మొదటి పేజి తరువాయి

తాను నివసిస్తున్న గదిలోనే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తోటి విద్యార్థులు గమనించి సమాచారం అందించడంతో ఈ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సమాచారం అందుకున్న గండేపల్లి పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ముఖ్యంగా బషీర్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు, ఏ యాప్ నుండి లోన్ తీసుకున్నాడు, అతడికి వచ్చిన బెదిరింపు కాల్స్ మరియు మెసేజ్‌ల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. సైబర్ క్రైమ్ విభాగం కూడా ఈ కేసులో లోతైన విచారణ జరుపుతోంది.

యువత ఇలాంటి లోన్ యాప్‌ల ఉచ్చులో పడి ప్రాణాలు తీసుకోవద్దని రెండు రాష్ట్రాల పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో తక్కువ వడ్డీకి, తక్షణమే రుణాలు ఇస్తామని ఆశచూపే అనధికారిక యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఎవరైనా వేధింపులకు గురవుతుంటే తక్షణమే '1930' సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా స్థానిక పోలీసులను ఆశ్రయించాలని సూచిస్తున్నారు. లోన్ యాప్ నిర్వాహకుల ఆగడాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, అనుమతులు లేని యాప్‌లను నిషేధించేలా చర్యలు చేపడతామని ఉన్నతాధికారులు భరోసా ఇచ్చారు

# సమస్య పరిష్కారం వరకు ఉద్యమం కొనసాగిస్తాం

➢ మొదటి పేజి తరువాయి

కాంట్రాక్టర్లు, శుభ్రత కార్మికులకు చెల్లింపులు చేయకపోవడం వల్ల వందల లారీల చెత్త పేరుకుపోయిందని తెలిపారు. కుళ్లిపోయిన కూరగాయల వల్ల దుర్గంధం వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మార్కెట్‌లో పరిశుభ్రత పూర్తిగా దెబ్బతిందని, మురుగునీరు కాళ్ల కిందకి వచ్చి పుండు పుట్టించే స్థాయికి చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల కారణంగా కస్టమర్లు రావడం తగ్గి వ్యాపారం దెబ్బతింటోందని పేర్కొన్నారు. మంత్రులు, కమిషనర్‌కు పలుమార్లు తెలియజేసినా సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు.

మహిళల కోసం ఉన్న టాయిలెట్ సదుపాయాలు అత్యంత దారుణంగా ఉన్నాయని తెలిపారు. నీరు లేకపోవడం, తలుపులు లేకపోవడం వంటి సమస్యలతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా పనిచేయడం లేదని, నీటి ట్యాంకులు ఉన్నా నీరు అందుబాటులో లేదని వివరించారు. ఆరోగ్యకరమైన మార్కెట్‌గా ఉండాల్సిన ప్రదేశం రోగాల కేంద్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెత్త పూర్తిగా తొలగించడం, డ్రైనేజీ శుభ్రపరచడం, మంచినీటి సరఫరా మెరుగుపరచడం, బయోగ్యాస్ ప్లాంట్ పునరుద్ధరణ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ధర్నా కొనసాగిస్తానని హెచ్చరించారు. అవసరమైతే మార్కెట్‌ను తాత్కాలికంగా మూసివేసి పూర్తిగా శుభ్రం చేయాలని సూచించారు. ప్రభుత్వంపై కూడా ఈటెల రాజేందర్ తీవ్ర విమర్శలు చేశారు. భారీ ప్రాజెక్టులపై దృష్టి పెట్టిన ప్రభుత్వం ప్రాథమిక సదుపాయాలపై నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారులను పంపించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే వేలాది కార్మికులతో కలిసి ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామని స్పష్టం చేశారు.

# ఎల్‌బీ స్టేడియంలో క్రీడల సందడి

➢ మొదటి పేజి తరువాయి



సమావేశాల సందర్భంగా శాసనమండలి, శాసనసభ సభ్యులకు నిర్వహించే ఈ క్రీడలు గత 14 సంవత్సరాలుగా నిలిచిపోయిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వాటిని మళ్లీ ప్రారంభించారు. కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి పలు క్రీడల్లో స్వయంగా పాల్గొని అందరిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎల్‌బీ స్టేడియంకు గొప్ప చరిత్ర ఉందని, ప్రపంచ స్థాయి క్రీడాకారులు ఇక్కడ ఆడినట్టు గుర్తు చేశారు. ఈ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే గచ్చీబౌలి క్రీడా మైదానాలను రూ.700 కోట్లతో ప్రపంచ స్థాయి సదుపాయాలతో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. 2034 నాటికి ఒలింపిక్స్ నిర్వహించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. మూడు నెలల్లో పనులు ప్రారంభించి, వచ్చే మూడేళ్లలో గచ్చీబౌలిలో అన్ని క్రీడలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బేగంపేట హాకీ మైదానాన్ని కూడా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

తెలంగాణలో క్రీడలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం క్రీడా విధానాన్ని అమలు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సీఎం కప్ పోటీలను నిర్వహిస్తూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు.



అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా యువతను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు క్రీడాపోటీలు నిర్వహించగా, ముఖ్యమంత్రి స్వయంగా ఫుట్‌బాల్ మ్యాచ్‌లో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. మొత్తం కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగి, క్రీడల ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేసింది.

# ప్రపంచ యుద్ధం ముంగిట పశ్చిమాసియా





➢ మొదటి పేజి తరువాయి

హార్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును మరింత బిగించింది. శత్రు దేశాలకు చెందిన వాణిజ్య నౌకల ప్రయాణాన్ని పూర్తిగా నిషేధిస్తూ ఇరాన్ విప్లవ దళాలు ఉత్తర్వులు జారీ చేశాయి. అయితే, భారత్, రష్యా, చైనా వంటి మిత్ర దేశాలకు చెందిన చమురు నౌకలకు మాత్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం. ఇప్పటికే భారత జెండాతో ఉన్న కొన్ని నౌకలు సురక్షితంగా ఈ జలసంధిని దాటినట్లు సమాచారం అందుతోంది. భారత్ వంటి దేశాల ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇరాన్ ఈ మినహాయింపు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ, ఈ మార్గంలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

గడచిన 24 గంటల్లో ఇజ్రాయెల్ దళాలు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని అణు కేంద్రాలు మరియు పారిశ్రామిక ప్రాంతాలపై భారీగా క్షిపణి దాడులు నిర్వహించాయి. ఈ దాడులలో ఇరాన్‌కు చెందిన రెండు ప్రధాన ఉక్కు కర్మాగారాలు మరియు ఒక విద్యుత్ కేంద్రం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇజ్రాయెల్ దాడులకు ప్రతికారంగా ఇరాన్ కూడా సౌదీ అరేబియాలోని అమెరికా సైనిక స్థావరాలపై డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడులలో దాదాపు 12 మంది అమెరికా సైనికులు గాయపడినట్లు పెంటగాన్ వర్గాలు ధృవీకరించాయి. ఇరు పక్షాల మధ్య దాడులు తీవ్రం కావడంతో ఆ ప్రాంతంలో నివసిస్తున్న సామాన్య ప్రజలు ప్రాణభయంతో సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ సంక్షోభంపై స్పందిస్తూ, ఏప్రిల్ 6వ తేదీ లోపు హార్మూజ్ జలసంధిని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని ఇరాన్‌కు డెడ్ లైన్ విధించారు. ఒకవేళ ఇరాన్ మొండిగా వ్యవహరిస్తే ఆ దేశ చమురు నిల్వలపై భారీ దాడులు తప్పవని హెచ్చరించారు. మరోవైపు, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఈ సైనిక చర్య మరికొన్ని వారాల పాటు కొనసాగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. ఐరోపా దేశాలు మరియు నాటో కూటమి ఈ యుద్ధంలో తమకు సహకరించడం లేదని ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సమాజం ఈ దాడులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ, అగ్ర దేశాల మధ్య సయోధ్య కుదరడం లేదు.

భారత ప్రభుత్వం పశ్చిమాసియాలోని తాజా పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. యుద్ధ ప్రాంతంలో చిక్కుకున్న భారతీయ నావికులను మరియు పౌరులను రక్షించడానికి విదేశాంగ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. భారత ప్రధానమంత్రి ఇతర దేశాల నేతలతో సంప్రదింపులు జరుపుతూ శాంతి స్థాపనకు కృషి చేస్తున్నారు. ఇంధన సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని పెట్రోలియం శాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి. యుద్ధం గనుక సుదీర్ఘ కాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పతనం అయ్యే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. రానున్న కొన్ని రోజులు ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించడంలో అత్యంత కీలకంగా మారనున్నాయి.

# జేవర్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం

➢ మొదటి పేజి తరువాయి

రూపొందించిన ఈ ప్రాజెక్ట్, భవిష్యత్ భారత ఆర్థిక అభివృద్ధికి పునాది వేస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జేవర్ విమానాశ్రయం ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాల్లో ఒకటిగా రూపుదిద్దుకుంది. ఆధునిక సాంకేతికతతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌లో ఎయిర్ కార్గో టెర్మినల్, మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో) కేంద్రాలు, ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సంవత్సరానికి సుమారు 7 కోట్ల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యం ఈ విమానాశ్రయానికి ఉండటం దీని ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఈ స్థాయి సామర్థ్యం భారత విమానయాన రంగంలో ఒక పెద్ద మార్పుకు దారి తీస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

యమునా ఎక్స్‌ప్రెస్‌వే ద్వారా సులభమైన రవాణా అనుసంధానం కల్పించడంతో ఈ విమానాశ్రయం ఢిల్లీ, నోయిడా, గ్రేటర్ నోయిడా మరియు పరిసర ప్రాంతాలకు మరింత చేరువవుతోంది. ఇప్పటికే ఉన్న ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఉన్న ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, అంతర్జాతీయ విమాన సర్వీసులను విస్తరించే అవకాశాన్ని ఇది అందిస్తుంది. తద్వారా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతం ప్రపంచ స్థాయి రవాణా కేంద్రంగా ఎదగడానికి మార్గం సుగమం అవుతుంది. ఈ ప్రాజెక్ట్ వాణిజ్య, పరిశ్రమల రంగాలకు పెద్ద ఊతంగా నిలవనుంది. భారీ స్థాయిలో పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన కార్యకలాపాలు వేగవంతం కావడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఇది మరింత బలాన్నిస్తుంది.

ప్రధానమంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారతదేశం మౌలిక వసతుల అభివృద్ధిలో వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. విమానయాన రంగంలో ప్రపంచ స్థాయిలో పోటీపడేలా దేశాన్ని తీర్చిదిద్దడం లక్ష్యమని చెప్పారు. ఈ విమానాశ్రయం ద్వారా ప్రాంతీయ అభివృద్ధి మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ, రాష్ట్రాన్ని "ఉడాన్ ప్రదేశ్"గా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధి, పరిశ్రమల ప్రోత్సాహం, పెట్టుబడుల ఆకర్షణ---ఈ మూడు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని వివరించారు.

జేవర్ విమానాశ్రయం నిర్మాణం ద్వారా ప్రాంతీయ సమతుల్యతను కూడా సాధించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. దేశంలోని ఉత్తర ప్రాంతాల్లో అభివృద్ధి వేగాన్ని పెంచే ఈ ప్రాజెక్ట్, భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులకు ద్వారం తీస్తుందని భావిస్తున్నారు. మొత్తంగా జేవర్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం భారత విమానయాన రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాన్ని గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఈ ప్రాజెక్ట్ కీలక మైలురాయిగా నిలవనుంది. ఇది కేవలం ఒక విమానాశ్రయం మాత్రమే కాకుండా, దేశ అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లే శక్తివంతమైన ప్రేరణగా నిలుస్తోంది.

# మూసీ నది ప్రక్షాళన ఆగదు

హైదరాబాద్, మార్చి 28 : ఎవరెన్ని విమర్శలు, అడ్డంకులు సృష్టించినా మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మానవ తప్పిదాల వల్ల గొప్ప చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరం కనుమరుగయ్యే ప్రమాదం నుంచి కాపాడి, భవిష్యత్తు తరాలకు అత్యద్భుత నగరాన్ని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మూసీ నది శుద్ధి ప్రస్తుతం అత్యవసరమైన అంశమని, దీనిపై ఎలాంటి రాజీ ఉండదని అన్నారు.

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో భాగంగా గండిపేట-మంచిరేవుల ప్రాంతంలోని చారిత్రక వీరభద్రస్వామి ప్రాంగణంలో శ్రీ మచిలేశ్వర స్వామి, శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోవు పూజ చేసి గోశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయాల అభివృద్ధికి సంబంధించిన పూజలు, శంకుస్థాపనలు ఘనంగా జరిగాయి.

సుమారు 1400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని దాదాపు 8 ఎకరాల్లో రూ.700 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనతో పాటు ఈ ప్రాంతాన్ని ధ్యానమందిరాలు, సాంస్కృతిక కట్టడాలతో ప్రత్యేక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. మూసీ నది ప్రక్షాళనను ఏ పరిస్థితుల్లోనూ ఆపబోమని, ఇది ప్రభుత్వ దీక్ష అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రామప్ప ఆలయ నమూనాలో నిర్మాణాలు చేపట్టాలని సంకల్పించామని, ఇది యాదృచ్ఛికంగా కాకుండా దైవ సంకల్పంతో జరుగుతున్న కార్యక్రమమని అన్నారు.

నదీ పరీవాహక ప్రాంతాలు అభివృద్ధికి కేంద్రబిందువులుగా మారుతాయని చరిత్ర చెబుతోందని, తెలంగాణకు సముద్రతీరం లేకపోయినా నదులను సమర్థంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది కాలుష్యం వల్ల ఏర్పడిన సమస్యలను ఉదాహరణగా తీసుకుని, హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మూసీ ప్రక్షాళనతో పాటు నగరంలో మత సామరస్యాన్ని ప్రతిబింబించే నిర్మాణాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. చార్మినార్ ప్రాంతంలో మసీదు, గౌలిగూడలో సిక్కు దేవాలయం, ఉప్పల్ ప్రాంతంలో చర్చి నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గోదావరి నుంచి నీటి సరఫరా ద్వారా నగర అవసరాలను తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నాలు చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ వ్యవస్థలో సమగ్ర మార్పులకు శ్రీకారం

చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న మౌలిక వసతుల తేడాలను తగ్గించే దిశగా ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో శాసనసభ సమావేశ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి అంగన్‌వాడీ చిన్నారుల కోసం ప్రతిష్టాత్మక బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా చిన్నారులకు ఉదయం పూట పోషకాహారాన్ని అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అదే సమయంలో అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం ద్వారా సేవల పర్యవేక్షణ, డేటా నిర్వహణను ఆధునీకరించాలనే ప్రయత్నం కనిపిస్తోంది.

ముఖ్యమంత్రి తన ప్రసంగంలో పిల్లల ఆరోగ్యం దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉందని స్పష్టం చేశారు. గర్భిణీ దశ నుంచే పోషకాహారం అందించడం ఎంత ముఖ్యమో వివరించారు. తల్లి ఆరోగ్యం, గర్భంలోని శిశువు ఎదుగుదల, పుట్టిన తర్వాత బాల్య దశలో సరైన ఆహారం---ఈ మూడు అంశాలు సమగ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించవచ్చని ఆయన తెలిపారు. ఈ పథకాన్ని రూపొందించే ముందు వైద్య నిపుణులు, పోషకాహార నిపుణులతో విస్తృతంగా చర్చించినట్లు వెల్లడించారు.

THARANGALU DAILY NEWS
ఆదివారం, 29 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## రాజకీయ కక్ష సాధింపు తోనే అక్రమ కేసులు
## మాజీ ఎంపీపీ జక్కా అశోక్ యాదవ్ ఆగ్రహం



**తరంగాలు, మార్చి:28, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండలం లో మాజీ ఎంపీపీ జక్కా అశోక్ యాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే నాపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే మాధవరెడ్డి వద్ద చలామణి అవుతున్న సూదిని అజయ్ రెడ్డి తన స్వార్థ ప్రయోజనాల కోసం మండలంలో చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. మండలంలో కాంట్రాక్టు పనుల్లో తన పెత్తనం సాగించేందుకు తన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు లీడర్లను మండలంలో చలామణి చేయించడానికి కుట్రలో భాగంగానే ఈ తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే పోలీసు అధికారులు ఏసిపి రవీందర్ రెడ్డి, ఎస్ ఐ రాజేష్ రెడ్డి లపై ఒత్తిడి చేస్తూ నాపై అక్రమంగా కేసులు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం జల్లి గ్రామంలో కేవలం " క్వార్టర్ మందు" కోసం జరిగిన చిన్నపాటి గొడవను అడ్డుపెట్టుకొని తనను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని, గొడవ జరిగిన రోజు గానీ, విచారణ జరిగిన రోజు గానీ నేను ఊర్లో లేనని, బాధితులు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపిన సమయంలోను నేను మండల పరిధిలో లేనని కనీసం సంబంధం లేని నన్ను రాజకీయంగా తొక్కేయాలని కుట్రలో భాగంగానే ఈ అక్రమ కేసుల్లో చేర్చారని అన్నారు. సూదిని అజయ్ రెడ్డి తన అక్రమ సంపాదన కోసం ఎమ్మెల్యే వద్ద ఎవరినైనా దొంగలుగా చిత్రీకరిస్తారని, చివరికి సొంత అన్నదమ్ములను కూడా దూరం చేయగల దుర్మార్గుడు అని ఘాటుగా విమర్శించారు. జల్లి గ్రామంలో భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా దానికి అజయ్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కేసు విషయంలో ఏసిపి నిష్పక్షపాతంగా వ్యవహరించి విచారణ జరిపి అక్రమ కేసు నుండి తన పేరును తొలగించాలని డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ - పెండెం శ్రీలక్ష్మి రామానంద్





**తరంగాలు, మార్చి:26, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నర్సంపేట పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 1 వ వార్డు మాదన్నపేటలో చైర్ పర్సన్ శ్రీలక్ష్మి రామానంద్, స్థానిక వార్డు కౌన్సిలర్ మేఘన శ్యామ్ రాజ్ లు మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు సౌకర్యం, వడ్డీ లేని రుణాలు వంటి పథకాలతో పాటు ఇందిరమ్మ చీరల పంపిణీ తో మహిళలకు అండగా ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో అవసరం ఉన్న చోట మహిళా సమాఖ్య భవనాలను నిర్మిస్తామని అన్నారు. పట్టణంలోని ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరను పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం 1 వ వార్డు స్వయం సహాయక సంఘ సభ్యులు, వార్డు మహిళలు చైర్ పర్సన్ శ్రీలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లు బాణాల ప్రసన్న, పొన్నాల మనీషా, వేల్పుల శ్రీలత, బండి స్వరూప, వివో అధ్యక్షురాలు అలం అరుణ, ములుగూరి మమత, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**తరంగాలు,మార్చి:28, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి:** కొత్తగూడ మండలంలో ఇటీవల మరణించిన పలు బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను నర్సంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. మండలంలోని పోగుళ్లపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్మనబోయిన మల్లయ్య భార్య లక్ష్మి కిడ్నీ సమస్యతో బాధపడి మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, కొత్తగూడ గ్రామ పార్టీ అధ్యక్షుడు దారం సమ్మయ్య కుమారుడు దారం రాహుల్ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఓటాయి గ్రామంలో స్వేరో జిల్లా నాయకులు చింత సదానందం తల్లి లక్ష్మి ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పెద్ది సుదర్శన్ రెడ్డి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్, మండల నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సిఐటీయు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి ఇంట్లో పోలీసుల అరాచకం



**వరంగల్ జిల్లా ప్రతినిధి,మార్చి 28,(తరంగాలు)**

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి ఇంట్లోకి ప్రవేశించిన పోలీసులు అరాచకానికి పాల్పడ్డారు. ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో హైదరాబాద్ పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆశ యూనియన్ నాయకులు, వర్కింగ్ ఉమెన్ నాయకులు సిఐటియు రాష్ట్ర,జిల్లా నాయకుల నివాసాలపై దాడులు చేసిన పోలీసులు వందల సంఖ్యలో కార్యకర్తలను ముందస్తు జాగ్రత్త పేరుతో అరెస్టు చేసి స్టేషన్లలో ఉంచారు.ఇందులో భాగంగా వరంగల్ లోని ఇంతెజార్ గంజ్ పోలీస్ స్టేషన్ నుండి నలుగురు పోలీసులు రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి నివాసంలోకి చొరబడ్డారు. 84 సంవత్సరాల వయసులో ఉన్న మాధవి తల్లిదండ్రులు మాధవి ప్రస్తుతం ఇంట్లో లేదని బయటకు వెళ్లిందని చెప్తున్నా వినకుండా పోలీసులు ఇల్లంతా కలియ దిరిగి మాధవికి సంబంధించిన వ్యక్తిగత వస్తువులు,బట్టలు, కాగితాలు,పుస్తకాలు చిందరవందర చేశారు.నిరుపేద కార్మికుల యూనియన్ ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరై ఇంటికి తీసుకువచ్చిన బ్యాగును తెరిచి బ్యాగ్ లో ఉన్న వస్తువులన్నీ బయటికి తీసి చెల్ల చెదురుగా పడేశారు.ముందస్తు కస్టడీకి తీసుకోవాల్సిన వ్యక్తులు లేకపోతే వారికి సంబంధించిన వస్తువులు,పుస్తకాలు, వ్యక్తిగత వస్తువులు, బ్యాగులు తనిఖీ చేసి,సోదా చేసి సదరు నాయకురాలు ఆ బ్యాగులో దాక్కుందని పోలీసు యంత్రాంగం భావిస్తుందో ఏమో తెలియడం లేదన్నారు.అర్ధ రాత్రి ఈ విధంగా మహిళా కార్యకర్తల పై దాడులకు పాల్పడి సోదాల పేరుతో అరాచకానికి పాల్పడుతున్న పోలీసు యంత్రాంగ దాష్టీకాన్ని సిఐటియు వరంగల్ జిల్లా కమిటీ ఖండిస్తుందన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో ప్రజలను మోసగిస్తున్న కాంట్రాక్టర్

- దుబ్బ ఇసుకతో సిసి రోడ్ల నిర్మాణాలు
- నాణ్యత ప్రమాణాలను తుంగలో తొక్కిన వైనం
- అడిగిన వారి పట్ల దురుసు ప్రవర్తన



**ఇల్లందు ప్రతినిధి మార్చి28,( తరంగాలు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం బాలాజీ నగర్ పంచాయితీకి ఎం.జి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు 12 లక్షల రూపాయలు సీసీ రోడ్లకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది. వార్డులలో నడవడానికి వీలు లేకుండా ఉన్న గల్లీలలో సిసి రోడ్లు వేసేందుకు పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేశారని స్థానికులు తెలిపారు.ప్రజా ప్రభుత్వంలో ప్రజలను మోసగించడమే పనిగా పెట్టుకున్న కాంట్రాక్టర్,ఆయనకు ఇష్టం వచ్చినట్టుగా రోడ్లు వేసి చేతులు దులుపుకున్నారని ఆరోపిస్తున్నారు. రోడ్లు వేసేముందు పంచాయతీరాజ్ ఏఈ రోడ్లను పరిశీలించక పోవడం వేసిన మెటీరియల్ చూడకపోవడం సదరు కాంట్రాక్టర్ ఏఈ ఒక్కటై నాణ్యత లేకుండా వేసిన రోడ్లకు బిల్లులు తీసుకోవచ్చనే ఆలోచనలో ఉన్నారంటూ ప్రజలు బహిరంగంగా చర్చించుకోవడం గమనర్హం. సిసి రోడ్ల పనులను సక్రమంగా నిర్వహించటంలో తప్పిదాలు చేసిన ఏ ఈ కాంట్రాక్టర్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## సి సి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్ లక్పతినాయక్



**జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 28,(తరంగాలు):** మండలంలోని ముక్తుశీతండా గ్రామా పంచాయితీ పరిధిలోని అవుసులతండాలో 5లక్షల రూపాయలతో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిధులతో సిసి రోడ్డు నిర్మాణా పనులను స్థానిక సర్పంచ్ బానోత్ లక్పతి నాయక్ ప్రాంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జువారి.జగన్, వాంకుడొత్ అశోక్ నాయక్, జువారి.రమేష్, బానోత్.రమేష్ నాయక్, బానోత్ దుర్గాసింగ్, జువారి.బాలాజీ,కారొబార్ బానోత్.జగన్, జువారి. లక్ష్మణ్ సింగ్, తదితరులు తండావాసులు పాల్గొన్నారు

## తహసీల్దార్ సైదులకు సాదర స్వాగతం



**పాలేరు ఆర్సీ, మార్చి 29 (తరంగాలు) :** కూసుమంచి మండల నూతన తహసీల్దార్ గా బదిలీపై వచ్చిన సైదులుకు మండల ఆర్ఐలు రాము, జ్యోతి, మండల సర్వేయర్ వెంకట్, కార్యాలయం సిబ్బంది మురళి, ఏఎస్వోలు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సిబ్బంది అందరితో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. ప్రభుత్వం విధివిధానాలను తూచా తప్పకుండా సమస్యల పరిష్కారమే పరమావధిగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న నలుగురి పట్టివేత

- వివరాలను వెల్లడించిన సీఐ సత్యనారాయణ



**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మార్చి.28, తరంగాలు** : అక్రమంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను కేసముద్రం పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుని వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ మేరకు సీఐ సత్యనారాయణ తెలిపిన కథనం ప్రకారం ఎస్ కే రఫీ (27) ముత్యాలమ్మ గూడెం మహబూబాబాద్, సముద్రాల శ్రీనాథ్ (20) జమాండ్లపల్లి, పిట్టల సాయికుమార్ (21) మహబూబాబాద్ , జూజారు రఘు (21) ముత్యాలమ్మ గూడెం కి చెందిన నలుగురు వ్యక్తులు గంజాయిని తరలిస్తుండగా శనివారం గంజాయిని స్వాధీనం చేసుకుని వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నలుగురు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి గత కొన్ని నెలలుగా వరిస్తా నుండి గంజాయి తెచ్చి చిన్న ప్యాకెట్ లో ప్యాక్ చేసి కేసముద్రం మహబూబాబాద్ మున్సిపాలిటీ లో చుట్టూ ప్రక్కల యువతకు గంజాయిని అమ్మి గంజాయికి బానిసలను చేసి డబ్బులను సంపాదిస్తున్నారని, వారి వద్ద నుండి రెండు లక్షల విలువైన రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి జైలుకు పంపించామని తెలిపారు. చట్టరీత్యా గంజాయిని అమ్మడం నేరమని, గంజాయి విక్రయం చేస్తే ఎలాంటి వారినైనా ఊరుకునేది లేదని చట్టరించ చర్య తీసుకుంటామని హెచ్చరించారు. యువత గంజాయి కి బానిస కావద్దని అన్నారు. ఈ నేపథ్యంలో సీఐ వై .సత్యనారాయణ , కార్యక్రమంలో ఎస్సై కె .క్రాంతి కిరణ్ , పోలీస్ సిబ్బందిని డీఎస్పీ తిరుపతిరావు ఎస్పీ డాక్టర్ శబరీష్ అభినందించారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
ఆదివారం, 29 మార్చి, 2026


## రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి




**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి ,మార్చి. 28,తరంగాలు:** సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడం వల్ల ఖర్చు, శ్రమ తగ్గి అధిక దిగుబడి సాధించేందుకు దోహదపడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి భూక్య సరిత, సహాయ వ్యవసాయ సంచారకులు అజ్మీర శ్రీనివాసరావు అన్నారు. శనివారం నాడు కేసముద్రం మున్సిపాలిటీ పరిధి ధన్నసరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంను మండల వ్యవసాయ అధికారి బానోత్ వెంకన్న తో కలిసి సందర్శించి యూరియా నిలువలు యూరియా యాప్ ద్వారా యూరియా పంపిణీ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం రైతులకు డ్రోన్ ద్వారా పిచికారి చేసే యంత్రాలను పరిశీలించి సొసైటీ నిర్వాహకులు గ్రోన్ ఆపరేటర్ తో ఎప్పటికప్పుడు డ్రోన్ ద్వారా పిచికారి చేసిన వివరాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రోన్ తో రైతుల క్షేత్రాలలో పిచికారి చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపి, రైతులు మ్యానువల్ గా పిచికారి చేసే పంపులతో పిచికారి చేస్తే రైతులకు శారీరక శ్రమ ఎక్కువగా ఉంటుందని ఖర్చులు అధికంగా ఉంటాయని పంపుల ద్వారా పిచికారి చేసి సమయంలో మాస్కులు హెల్మెట్లు వాడకపోవడం వలన ఆప్రాన్లు తొడకపోవడం చేతులకు బ్లౌజులు వాడకపోవడం వలన శరీరంలోకి వెళ్లి అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని, రైతులు ఆధునిక పద్ధతులను పాటించి గ్రౌండ్ల సహాయంతో పంట క్షేత్రాలలో పిచికారి చేసినట్లయితే ఖర్చులను తగ్గించి సరైన డోసు పంటలపై పిచికారి చేయడం వల్ల గురువులను తెగుళ్లను సమర్ధవంతంగా నివారించవవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారి ఛాయారాజ్, వ్యవసాయ విస్తరణ అధికారి ధరావత్ రాజేందర్, సొసైటీ సిబ్బంది డ్రోన్ పైలెట్లు రైతులు పాల్గొన్నారు.




## పోతుగంటి కృష్ణయ్య కుటుంబానికి అండగా నిలిచిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఉప్పల వెంకటేష్



**కల్వకుర్తి. మార్చి 28. తరంగాలు ప్రతినిధి.**
కల్వకుర్తినియోజకవర్గం గుండూర్ గ్రామానికి చెందిన పోతుగంటి కృష్ణయ్య అకాల మరణంతో ఈ విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు సర్పంచి అయిననేని లక్ష్మమ్మ,ఐనేనిసూర్యప్రకాశరావు ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు మాట్లాడుతూ అధికారంలో ఉండి కాంగ్రెస్ పార్టీ చేయలేని పనులను అధికారం లేకున్నా ఆర్థిక సహాయం చేస్తున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్మికసంఘంఅధ్యక్షుడు,సూర్యప్రకాష్ రావు గ్రామ సర్పంచ్ ఐనేని లక్ష్మమ్మ ,అయ్యనేని సూర్య ప్రకాష్ రావు ,బిఆర్ఎస్ నాయకులు రాజేందర్, నాగేంద్రం, జానీ, పోతనపల్లికృష్ణయ్య ,సత్యనారి ,పోతనపల్లి శేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను కలిసిన జీపీవోలు



**పాలేరు ఆర్సీ,మార్చి 29 (తరంగాలు) :** కూసుమంచి మండల నూతన తహసీల్దార్ గా శనివారం బాధ్యతలు చేపట్టిన సైదులును మండలంలో విధులు నిర్వహిస్తున్న జీపీవోలు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సైదులు మాట్లాడుతూ జీపీవోలు, ఇతర సిబ్బంది అందరం కలిసి కట్టుగా మండల అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన రెవిన్యూ సేవలు అందించడానికి తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రభుత్వ విధివిధానాలను తూచా తప్పకుండా సమస్యల పరిష్కారమే పరమావధిగా పనిచేస్తామన్నారు. తహసీల్దార్ ను కలిసిన వారిలో జీపీవోలు అంగోతు ఉపేందర్, వస్రం, అజిజ్, బాలాజీ, ఇందిర, ఖాదర్, వీరబాబు, శ్రీనివాసరావు, మాధవరావు, జిల్ల రమణ, ఘోష్, టీ శ్రీనివాసరావు, నవాబ్, సుధాకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మృతురాలు కుటుంబానికి రూ. 10వేలు ఆర్థిక సహాయం

•అందజేసిన జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్



**కల్వకుర్తి. మార్చి 28 తరంగాలు ప్రతినిధి**
కడ్తాల్ మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతూ గత వారం రోజుల క్రితం సిద్ధిగారి సంతోష మరణించింది.వారి కుటుంబ సభ్యు లకు పరామర్శించి అధైర్య పడద్దని ఏలాంటి సహాయ సహకారాలు కావాలన్నా రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ తరఫున తక్షణ సహాయం గా ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగింది.అదేవిధంగా కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ తమ వంతు సహాయంగా మృతురాలు సిద్దిగారి సంతోష కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయలు సహాయం చేయడం జరిగింది. సిద్ది సంతోష కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ తరపున తమ కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించడం జరిగిందని వారికి తమ కుటుంబ సభ్యుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్ సేవ్య నాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, నాయకులు మంగళపల్లి నరసింహ, పాండు నాయక్, వెంకటేష్, శ్రీకాంత్, మహేష్, మురళి,అంజి, శ్రీకాంత్, రాఘవేందర్, శ్రీశైలం, జంగయ్య,జగన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రం,అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ



• జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.

**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,మార్చి.28, తరంగాలు** :శనివారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్, చిన్న గూడూరు మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల సరళిని పరిశీలించారు,మార్చి 14 తేదీ నుండి జిల్లాలోని (45) పరీక్షా కేంద్రాల ద్వారా (8157) మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, పరీక్షల నిర్వహణ కోసం ప్రభుత్వ సూచనల ప్రకారం ఫ్లయింగ్ స్క్వాడ్స్ (3) సిట్టింగ్ స్క్వాడ్స్ ప్రతీ కేంద్రానికి ఒక్కటి, సుమారు (528) పరీక్షల నిర్వహణ సిబ్బంది, (45) వైద్య బృందాల సిబ్బంది, అదనపు కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, నిత్య పర్యవేక్షణలో ఏలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు కొనసాగడం జరుగుతుందన్నారు,చీఫ్ సూపర్డెంట్లు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నపత్రాల ఓపెనింగ్, క్లోజింగ్ ప్రక్రియ, విద్యాశాఖ ప్రధాన కార్యాలయం నుండి వైర్లెస్ సెట్ ద్వారా పర్యవేక్షణ సూచనలు జారీ చేస్తున్నారని, ఈరోజు డీఈవో వి.రాజేశ్వర్, డోర్నకల్, కురవి (6) ఏజిసి మందుల శ్రీరాములు మహబూబాబాద్, గార్ల, బయ్యారం, 6 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ (18) కేంద్రాలలో జరుగుతున్న పరీక్షల సరళిని తనిఖీ చేశారనీ,శనివారం (8165) మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 99.89 శాతం నమోదు అయ్యిందని తెలిపారు, ఏప్రిల్ 16 వరకు జరిగే పరీక్షల నిర్వహణలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉందని తెలిపారు,అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి, రికార్డులను హాజరు, వివరాలను, స్టాకును తనిఖీ చేశారు,పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తూ వారికి అర్థమయ్యే విధంగా విద్యను అందించాలని సూచించారు, అంగన్వాడి కేంద్రం పరిధిలో ఉన్న శ్యామ్, మ్యామ్, పిల్లలను గమనిస్తూ ఉండాలని, బాలింతలకు, గర్భిణీలకు, చిన్నపిల్లలకు, బలవర్ధకమైన పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు,
అంగన్వాడీ టీచర్లు, పిల్లల హాజరు శాతం పూర్తిస్థాయిలో ఉండాలన్నారు,అన్ని విద్యాసంస్థలలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ లపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు, ఈ పర్యటనలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.



## ఆపదలో మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తున్న బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య

**కల్వకుర్తి.మార్చి 28 తరంగాలు ప్రతినిధి**
కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల కేంద్రానికి చెందిన వానరాశి చంద్రమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం సాయంత్రం మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి మృత దేహానికి పూలమాలతో నివాళులు అర్పించారు.అనంతరం వారణాసి చంద్రమ్మ కుటుంబ సభ్యులకు5000రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.అదేవిధంగా కుటుంబ సభ్యులు అధైర్య పడవద్దని ధైర్యంగా ఉండాలని ఎప్పుడూ ఏలాంటి సహాయం కావాలన్నా అండగా ఉంటామని భరోసా కల్పించారు.మృతురాలి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఆపద్బాంధవుడిలా ఏలాంటి పదవి లేకుండా వెల్దండ బి ఆర్ ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు జోగయ్య 5000 రూపాయలు ఆర్థిక సాయం చేయడం ఎంతో గొప్ప విషయమని ఆయనకు తమ కుటుంబ సభ్యుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మాజీ ఎంపిటిసి చలిచీమల నిరంజన్, వార్డు సభ్యులు సిర్సనగండ్ల శేఖర్,4 వ వార్డు సభ్యులు జంగిలి ఆనంద్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కొమ్ము నాగేష్, మట్ట శ్రీను, మావిళ్ళ గణేష్, కోట్ల శేఖర్, బెట్టి సైదులు, శివ, సిద్దు,గౌడుగు శివ, వానరాశి రాములు, శివ తదితరులు పాల్గొన్నారు.



THARANGALU DAILY NEWS
ఆదివారం, 29 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## ఉత్తమ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి

- వార్డు మెంబర్ ల శిక్షణ ముగింపు.
- ఎంపీవో రాజారావు.
- ధ్రువపత్రాలు అందజేసిన అధికారులు



**పాలేరు ఆర్సీ, మార్చి 29 (తరంగాలు)** : కూసుమంచి మండలంలోని గట్టుసింగారం రైతువేదికలో వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో రెండవ బ్యాచ్ శిక్షణ శనివారంతో ముగిసినట్లు ఎంపీవో రాజారావు తెలిపారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రెండవ బ్యాచ్ వార్డు సభ్యులందరినీ ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తీసుకున్న శిక్షణ గ్రామాలలో ఆదర్శవంతంగా పాలన సాగేందుకు ఉపయోగపడాలని, పారిశుధ్యం నిర్వహణ, నర్సరీల నిర్వహణ, తదితర ప్రజారోగ్య కార్యక్రమాలు సమర్ధవంతంగా నిర్వహించుకుని గ్రామాలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. ప్రతి వార్డు సభ్యుడు తమతమ వార్డులలో సమస్యలు అధికారుల గమనంలో ఉంచి ఆ సమస్యలు పరిష్కారం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అప్పుడు ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆవిధంగా ప్రతిఒక్కరు పొందిన శిక్షణను ప్రజాజీవితాని అనువయించుకుని పాలనలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి సభ్యుడు పంచాయతీ రాజ్ చట్టం గురించిన అవగాహన కలిగి ఉంటేనే ప్రగతి సాధ్యమని తలచి ఈ శిక్షణ ఇస్తుందని, అందుకు సహకరించిన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ శిక్షణకు టీవోటీలుగా వ్యవహరించిన గట్టుసింగారం పంచాయతీ సెక్రటరీ ఉపేందర్, జీళ్లచెరువు సెక్రటరీ రాజేష్, వేరే మండలంనుంచి కేటాయించబడిన రామక్రిష్ణను ప్రత్యేకంగా ఎంపీవో అభినందించారు. కార్యక్రమంలో శిక్షణపొందిన 14గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మెగా హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి. వసుంధర



**పాలేరు ఆర్సీ,మార్చి 28 (తరంగాలు )**

తిరుమలాయపాలెం మండలం లోని సుబ్లేడ్ పీహెచ్‌సీ లో మార్చి 30వ తేదీన సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మెగా హెల్త్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు సుబ్లేడ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి వసుంధర తెలిపారు.ఈ మెగా క్యాంపులో స్పెషలిస్ట్ డాక్టర్లు స్త్రీ వైద్య నిపుణులు,చిన్నపిల్లల వైద్యులు,జనరల్ వైద్యులు,కంటివైద్యులు,పంటి వైద్యులు, ఎముకల వైద్యులు సేవలు అందించనున్నారు.

సుబ్లేడు పిహెచ్సి పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు మెగా క్యాంపుకు వచ్చే వారు ఆధార్ కార్డు తీసుకొని మార్చి 30వ తేదీ న ఉదయం 9 గంటలకు సుబ్లేడు పీహెచ్‌సీ కి రావాలని మెడికల్ ఆఫీసర్ డా. వసుంధర కోరారు.

## తిరుమలాయపాలెం సంత వేలంపాట 1,56 వేల రూపాయలకు దక్కించుకున్న నెల్లూరి నవీన్ కుమార్

**పాలేరు ఆర్సీ,మార్చి 28 (తరంగాలు)**



తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ అయిన తిరుమలాయపాలెం కూరగాయల సంత వేలంపాట శనివారం నిర్వహించగా తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన నెల్లూరు నవీన్ కుమార్ ఒక లక్ష 56 వేల రూపాయలకు కూరగాయల సంత వేలం పాట దక్కించుకున్నారు. గత సంవత్సరం కూరగాయల సంత వేలం పాట ఒక లక్ష 27 వేల రూపాయలకు కాగా 2026... 2027 సంవత్సరం లో తిరుమలాయపాలెం కూరగాయల సంత వేలం పాట 1,56 ,000 వేల రూపాయల ధర పలికినది .ఈ కార్యక్రమం లో ఎంపీ ఓ పి ప్రభాకర్ రెడ్డి ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శి చల్లా భవ్య , గ్రామ సర్పంచ్ ధరావత్ సుజాత, ఉపసర్పంచ్ బుర్ర వాసు, వార్డు సభ్యులు కవిత ,కొమ్ము శ్రీను, ఉండేటి ధర్మరాజు వార నాగరాజు, నేలమరి రాజు , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

- తురకగూడెంలో ఘటన..
- అదేవ్యక్తిపై ఇప్పటికే రెండుసార్లు .
- ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు సమాచారం.
- కుల అహంకారిపై చట్టపరమైన చర్యలు
- తీసుకోవాలంటున్న బాధితుడు కొమ్ము వీరస్వామి

**పాలేరు ఆర్సీ, మార్చి 29 (తరంగాలు) :** కూసుమంచి మండలంలోని తురకగూడెం గ్రామానికి చెందిన కొమ్ము వీరస్వామిని కులంపేరుతో అదేగ్రామానికి చెందిన బుర్ర ప్రసాద్ కులంపేరుతో దూషించిన ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. గ్రామానికి చెందిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన కొమ్ము వీరస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల గ్రామంలో ఓ రైతు ఇంటికెళ్లి మాట్లాడుతుండగా అదే సమయంలో బుర్ర ప్రసాద్ తనను కులం పేరుతో అవమానిస్తూ, దూషణలకు పాల్పడ్డాడని తెలిపారు. ఈ ఘటనతో మనస్తాపానికి గురైన వీరస్వామి, పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన కూసుమంచి పోలీసులు సంఘటనపై ప్రాథమిక విచారణ నిమిత్తం, బుర్ర ప్రసాద్‌పై సంబంధిత చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాధితుడు ఎస్సీ వర్గానికి చెందినవాడై ఉండటంతో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇప్పటికే రెండు సార్లు బుర్ర ప్రసాద్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఫిర్యాదులు కూసుమంచి పోలీసులకు అందించడం జరిగిందని



FIRST INFORMATION REPORT
(Under section 173 and 176 BNSS)
T.S.P.M. Orders 470,500

1. District Khammam P.S. Kusumanchi Year 2026 FIR No. 86/2026 Date 27-03-2026
2. Acts & Section(s): 296(b) BNS,3(1)(r)(s) SC ST POA ACT
3. a) Occurrence of Offence: Day Wednesday Date & Time From 18-02-2026 18:00:00
Date & Time To Prior To Time Period
b) Information Received at P.S.: Date & Time 27-03-2026 20:45:00
General Diary Reference: Entry No 21 Date & Time 27-03-2026 20:45:00
4. Type of Information: Written
5. Place of Occurrence:
a) Distance and Direction From P.S.: 3KM, East Beat No.
b) Address Place House of Kanneboyina Suresh in Turkagudem village Area/Mandal Kusumanchi Street/Village Turakagudem
City/District KHAMMAM State Telangana PIN
c) In case, outside the limit of this Police Station, then
Name of P.S. District
6. Complainant / Informant:
a) Name Kommu Veeraswamy
b) Father's /Husband's Name Nalla Venkayya
c) Date/Year of Birth Age 68 Years
d) Nationality India e) Caste Madiga
f) Passport No Date of Issue Place of Issue
g) Occupation Farmer Mobile No. 9160729925
h) Address House No Area/Mandal Kusumanchi Street/Village Turakagudem
City/District KHAMMAM State TELANGANA PIN
7. Details of known/suspected/unknown accused with full particulars:
Serial No : 1
a) Name Barra Prasad
b) Veerabhadram



Father's /Husband's Name
c) Occupation d) Caste Golla e) Gender Male
f) Age 29 Nationality India
g) Address
House No Street/Village Turakagudem Area/Mandal Kusumanchi
City/District KHAMMAM State TELANGANA PIN
h) Phone(Off) Phone(Resi) Cell No
i) Email
Physical features, deformities and other details of the Suspect:

| S. No. | Sex | Date/Year of Birth | Build | Height (cms) | Complexion | Identification Marks(s) |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1 | Male | | | | | |

| Deformalities/ Peculiarities | Teeth | Hair | Eyes | Habbit(s) | Dress Habit(s) | Languages/ Dialect |
|---|---|---|---|---|---|---|
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| | | | | | | |

| Place Of | | | | |
|---|---|---|---|---|
| Burn Mark | Leucoderma | Mole | Scar | Tattoo |
| 15 | 16 | 17 | 18 | 19 |
| | | | | |

8. Reasons for delay in reporting by the complainant / informant:
The complainant approched to the village elders to held panchayath on this issue, but in vain
9. Particulars of properties stolen/involved (Attach separate sheet, if necessary):

గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, దళితుల పట్ల, కులం పట్ల అహంకారంతో వ్యవహరిస్తున్న బుర్ర ప్రసాద్ పై చట్టపరంగా చర్యలు తీసుకుని, గ్రామంలోని ఇతర ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాలతో అంటరానితనం నేరం, కులంపేరుతో దూషిస్తే కేసులు నమోదవుతాయని, శిక్షలు పడి జైలుజీవితం గడపాల్సి వస్తుందని పోలీసుల వైపునుంచి, ఇతర ప్రభుత్వ శాఖలనుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని బాధితులు కోరుతున్నారు.

## అసోసియేషన్ అనుమతి లేకుండా నూతన గోదాములు,దుకాణాలు వరంగల్ నగరంలో పెట్టొద్దు



- వరంగల్-హనుమకొండ- కాజీపేట జంట నగరాల ఎంప్టీ బాటిల్స్ వేస్ట్ పేపర్ -వేస్ట్ కాటన్ ఓల్డ్ ఐరన్ ప్లాస్టిక్ స్క్రాప్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం
- కొన్ని కార్పోరేట్ సంస్థలు గోదాములు,దుకాణాలు వరంగల్ నగరంలో ఏర్పాటు చేస్తే వందల కుటుంబాలు రోడ్డున పడతాయి

వరంగల్ ప్రతినిధి, మార్చి 28, తరంగాలు : ది గ్రేటర్ వరంగల్ ఓల్డ్ , ఎంప్టీ బాటిల్,వేస్ట్ పేపర్, వేస్ట్ కాటన్ ఓల్డ్ ఐరన్ ప్లాస్టిక్ స్క్రాప్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అనుమతి లేకుండా ఎవరూ నూతన గోదాములు,దుకాణాలు ఏర్పాటు చేయకూడదని అధ్యక్షులు పల్లకొండ ప్రభాకర్, ఉపాధ్యక్షులు పాలకుర్తి సారంగపాణి,ప్రధాన కార్యదర్శి కటకం వేణుగోపాల్ కోశాధికారి యాదా విజయ్ ఉప కార్యదర్శి యాదా సత్యం హెచ్చరించారు.శనివారం ది గ్రేటర్ వరంగల్ ఓల్డ్ ఐరన్, ఎంప్టీ బాటిల్,వేస్ట్ పేపర్, ప్లాస్టిక్ స్క్రాప్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ( వరంగల్ -హనుమకొండ-కాజీపేట)జంట నగరాల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులందరూ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా వరంగల్ జంట నగరాలలో సుమారు 100 పైన షాపులు నడిపించుకుంటున్నారు.ఈ షాపుల వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా కొన్ని వందల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారు.రెక్కడితే కాని డొక్కాడని పరిస్థితిలలో చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పోటీ ప్రపంచంలో మాకు సరైన వ్యాపారాలు లేక మేము ప్రస్తుతం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము.అయితే కార్పొరేట్ సంస్థల కన్ను వరంగల్ నగర వ్యాపారం పై పడిందని, త్వరలో కొందరు కార్పొరేట్ సంస్థలు హైదరాబాదులో ఉన్న డీలర్లు వరంగల్లో గోదాములు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మాకు సమాచారం తెలిసిందన్నారు.

వరంగల్లో కార్పొరేట్ సంస్థలు గోదాములు ఏర్పాటు చేస్తే మాలాంటి చిన్న వ్యాపారస్తులకు, ట్రాన్స్పోర్ట్ మిత్రులకు, హమాలి సోదరులకు, రోజువారి కూలీలకు తీరని నష్టం జరుగుతుందని,దీంతో వరంగల్ జంట నగరాల ఓల్డ్ ఐరన్ ఎంప్టీ బాటిల్స్ వేస్ట్ పేపర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో వరంగల్ జంట నగరాలైన వరంగల్- హనుమకొండ- కాజీపేట పరిధిలో మా ఓల్డ్ ఐరన్ అసోసియేషన్ అనుమతి లేకుండా ఎవరైనా హోల్సేల్ గా గాని, రిటైల్ గా గాని ఎలాంటి కొత్త గోదాములు, దుకాణాలు పెట్టవద్దని అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగిందన్నారు. మా అసోసియేషన్ వారికి తెలియకుండా షాపులు లేదా గోదాము ఏర్పాటు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ విషయంపై వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ మరియు వరంగల్ ఓల్డ్ ఐరన్ ఎంప్టీ బాటిల్స్ ప్లాస్టిక్స్ క్రాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పాలకుర్తి సారంగపాణి తీవ్రంగా ఖండించి అసోసియేషన్ తరపున ఎలాంటి సమస్య వచ్చినా పోరాడుటకై సిద్ధమని హామీ ఇచ్చారు.అదేవిధంగా ఈ విషయంపై వరంగల్ నగర ఎమ్మెల్యే దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మరియు విశ్రాంత ఐపీఎస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందనారు.

## ఘనంగా మరుపట్ల ప్రశాంత్ జన్మదిన వేడుకలు





వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 28,తరంగాలు :కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట యువ నాయకుడు,నల్లబెల్లి గ్రామం 3వ వార్డు సభ్యుడు మరుపట్ల ప్రశాంత్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి . ఈ సందర్భంగా ప్రశాంత్ తన పుట్టినరోజు సందర్భంగా వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ప్రజల పట్ల సేవాభావంతో ముందుకు సాగుతున్న ప్రశాంత్ ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తానని తెలిపారు.

# విమల గద్దర్‌ను పరామర్శించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

- నిమ్స్ ఆస్పత్రిలో ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న మంత్రి
- మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు
- కుటుంబానికి ధైర్యం చెప్పిన మంత్రి



**హైదరాబాద్, మార్చి 28 (తరంగాలు ప్రతినిధి):** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దివంగత ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ సతీమణి విమల గద్దర్‌ను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకొని వైద్యుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మంత్రి విమల గద్దర్ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందించడంతో పాటు నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని పేర్కొన్నారు. చికిత్సలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్పతో మంత్రి ప్రత్యేకంగా మాట్లాడి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా ఆదేశించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చికిత్స వెంటనే అందించాలని సూచించారు. వైద్య బృందం సమన్వయంతో పని చేయాలని అన్నారు.

విమల గద్దర్ కుటుంబ సభ్యులతో కూడా మంత్రి మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన వైద్య సదుపాయాల్లో ఎలాంటి కొరత ఉండనీయబోమని తెలిపారు.

ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ కుటుంబానికి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉందని మంత్రి పేర్కొన్నారు. వారి ఆరోగ్యం మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ వైద్య సేవల్లో ఉత్తమ ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ సందర్శనలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మరణంలోనూ మహోన్నతం ఆరుగురికి ప్రాణదానం

- నల్గొండ యువకుడి అవయవదానం సమాజానికి స్ఫూర్తి
- తల్లి మహేశ్వరి గారి ధైర్య నిర్ణయం ప్రశంసనీయం
- ఆరుగురికి పునర్జన్మ కల్పించిన హరీష్



**నల్గొండ, మార్చి 28 (తరంగాలు ప్రతినిధి):** నల్గొండ జిల్లాకు చెందిన 25 ఏళ్ల యువకుడు బత్తిని హరీష్ అకాల మరణం తీవ్ర విషాదాన్ని కలిగించింది. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఈ యువకుడి కథ దుఃఖంతో పాటు మానవత్వాన్ని గుర్తుచేసే ఉదాహరణగా నిలిచింది.తమ కుమారుడు ఇక లేడనే చేదు నిజాన్ని అంగీకరించడం ఎంతో కష్టమైనప్పటికీ, హరీష్ తల్లి మహేశ్వరి గుండె నిబ్బరంతో ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. తన కుమారుడి అవయవాలను దానం చేసి, ఇతరులకు జీవం పోయాలని ఆమె నిర్ణయించడం అందరినీ కదిలిస్తోంది. హరీష్ కిడ్నీలు, కాలేయం, గుండె, కళ్ళు వంటి ముఖ్య అవయవాలను దానం చేయడం ద్వారా ఆరుగురు రోగులకు కొత్త జీవితం లభించింది. మరణించిన తర్వాత కూడా తన ద్వారా మరికొంతమంది జీవితాల్లో వెలుగు నింపిన హరీష్ త్యాగం నిజంగా మహోన్నతమైనదిగా నిలిచింది.ఈ ఘటన సమాజానికి గొప్ప సందేశాన్ని అందిస్తోంది. అవయవ దానం ద్వారా ఎన్నో ప్రాణాలను రక్షించవచ్చని మరోసారి స్పష్టమైంది. అవయవదానం పట్ల అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని నిపుణులు సూచిస్తున్నారు.హరీష్ కుటుంబం చూపిన ధైర్యం, సామాజిక బాధ్యత అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. తీవ్ర దుఃఖంలోనూ ఇతరుల ప్రాణాలను కాపాడాలనే ఆలోచన వారికి ఉన్న మానవతా విలువలను ప్రతిబింబిస్తోంది. మొత్తంగా హరీష్ కథ మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచింది. "అవయవ దానం చేయండి -- ప్రాణదాతలు కండి" అనే సందేశాన్ని సమాజంలో విస్తృతంగా వ్యాప్తి చేయాల్సిన అవసరం ఉందని ఈ ఘటన తెలియజేస్తోంది.

# దేశ సేవకు అంకితమైన పార్టీ బిజెపి





- పార్టీ బలానికి మూలం బూత్ స్థాయి కార్యకర్తలు
- ప్రతి బూత్‌లో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలి
- రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలి
- బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్ ప్రతినిధి, మార్చి 28,తరంగాలు :** భారతీయ జనతా పార్టీ అనేది కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదు, దేశ సేవకు అంకితమైన సంస్థ అని బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు.భారతీయ జనతా పార్టీ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ -- 2026 కార్యక్రమం లో భాగంగా కాశిబుగ్గ మండల కార్యశాల నిర్వహించారు . ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ," పార్టీ బలానికి మూలం బూత్ స్థాయి కార్యకర్తలే అని,రానున్న కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి కార్యకర్త తమ బాధ్యతను గుర్తించి కట్టుదిట్టంగా పని చేయాలన్నారు.ప్రతి బూత్‌లో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలి. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వారికి అవగాహన కల్పించాలి. మనం చేసే ప్రతి పని ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు.ఎన్నికల్లో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, సమన్వయం మరియు అంకితభావంతో పని చేయడం అత్యంత అవసరం అన్నారు.ప్రతి కార్యకర్త ఒక నాయకుడిగా ముందుకు వచ్చి పార్టీ విజయానికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తక్కినపల్లి రాజేశ్వరరావు , రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, కార్యక్రమ కన్వీనర్ కందిమల్ల మహేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైరి మురళీకృష్ణ, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, మండల అధ్యక్షులు అపురూపర రజిని నేత,పార్టీ జిల్లా, మండల నాయకులు, పదాధికారులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# సమగ్ర భూ రీ సర్వే (నక్ష) పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని భవాని కుంట తండాలో నక్ష సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్
- ఎంపిడిఓ కార్యాలయంలో నక్ష సర్వే పురోగతిని సమీక్షించిన కలెక్టర్

**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 28,తరంగాలు :** రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాల పరిష్కారం మరియు యాజమాన్య హక్కుల నమోదు కోసం చేపట్టిన సమగ్ర భూ రీ సర్వే (నక్ష) కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.శనివారం వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలోని భవానీకుంట తండాలో వివిధ శాఖల అధికారులతో పాటు సర్వే బృందాల సహకారంతో జిల్లా కలెక్టర్ పంట పొలాల్లో నేరుగా పర్యటించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న భూముల సరిహద్దులు, కొలతలు మరియు సంబంధిత రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమగ్ర భూ సర్వేలో భాగంగా జియో కోఆర్డినేట్లు, డ్రోన్ సర్వే మరియు మ్యాపింగ్ సాంకేతికతలను వినియోగించి భూముల హద్దులను ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వేను పూర్తి చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో నక్ష సర్వే చేపట్టి భూముల హద్దులు, మ్యాపింగ్ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. సర్వేలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది ఆయా భూములకు సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.అనంతరం వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నక్ష సర్వేను సమర్థవంతంగా, వేగవంతంగా పూర్తి చేయడానికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ పరిధిలోని 10,240 ఎకరాల వ్యవసాయ భూమిలో 6,379 ఎకరాలకు రీ సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే మొత్తం 4,652 ఇండ్లకు గాను సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 158 బ్లాకులలో 102 బ్లాకుల్లో రీ సర్వే పూర్తయినట్లు తెలిపారు. మిగతా బ్లాకుల్లో కొనసాగుతున్న సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా భూముల కొలతల శాఖ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో సుమ, తహసిల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.



THARANGALU DAILY NEWS
ఆదివారం, 29 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ప్రజల గడపకే సేవలు - కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ దృఢ సంకల్ప



- పేదల వరంగా ముఖ్యమంత్రి సహాయనిధి
- నేరుగా లబ్ధిదారల ఇంటి వెళ్లి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేసిన 14వ డివిజన్ నాయకులు

**వరంగల్ ప్రతినిధి, మార్చి 28,తరంగాలు** : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును నేరుగా లబ్ధిదారల ఇంటి వెళ్లి 14వ డివిజన్ నాయకులు అందజేశారు.గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలో ఏనుమామూల , బాలాజీ నగర్, ఎస్ఆర్ నగర్, ఇందిరమ్మ కాలనీ ఫేస్ -2, గ్రామాలలోని ముఖ్యమంత్రి సహాయనిధి 5 మంది లబ్ధిదారులకు సుమారు 1 లక్ష 60వేల రూపాయలు విలువ గల చెక్కలను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు నేరుగా వారి ఇంటి వెళ్లి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 14వ డివిజన్ నాయకులు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు ప్రజల పక్షపాతిగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా గొప్ప ఆర్థిక భరోసా కల్పిస్తోందని అన్నారు. అత్యవసర సమయంలో ఈ సహాయం పేదల జీవితాల్లో కొత్త ఆశలను నింపుతోందని తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీ కే.ఆర్. నాగరాజు పేద ప్రజల సమస్యలను స్వయంగా గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షల వరకు ఎల్ ఓ సీ కాపీలు, సీఎంఆర్ ఎఫ్ చెక్కులు సకాలంలో అందజేస్తూ నిజమైన ప్రజా ప్రతినిధిగా, పెద్దన్నలా అండగా నిలుస్తున్నారని కొనియాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తూర్పాటి సులోచన - సారయ్య, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, డివిజన్ మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కుంభం శివపటేల్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు పస్తం శంకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు సౌరం చిన్నయ్య, బాలాజీ నగర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కడెం కుమార్, ఎన్టీఆర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఈర్ల రాజేందర్, ఎస్ఆర్ నగర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల స్టాలిన్, సుందరయ్య నగర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు త్రికోవెల శ్రీను, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పత్రి రాజేష్, డివిజన్ నాయకులు పస్తం కల్నాయక్, నర్సింగోజు నరేంద్ర చారి, మోటం సురేష్, పురాణం రవి, గంధం సారంగపాణి, రవి తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఎమ్మెల్యే నాగరాజు



**హైదరాబాద్, మార్చి 28,తరంగాలు** :హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే ఆర్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లుతూ వినతి పత్రం సమర్పించారు.ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వరంగల్ మండల పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పైడిపల్లి గ్రామ సమీపంలో సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, ఆ స్థలంలో నూతన ఈవి చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల ప్రాంతీయ రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, పర్యావరణానికి అనుకూలమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతుందని తెలిపారు.అదేవిధంగా, నియోజకవర్గానికి 100 కొత్త ఈవి బస్సులను కేటాయించాలని మంత్రి ప్రభాకర్ గౌడ్ వద్ద విజ్ఞప్తి చేశారు. ఈ బస్సుల ద్వారా ప్రజలకు మెరుగైన, ఆధునిక రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక, కొత్తగా ఏర్పాటు చేయనున్న బస్ స్టేషన్ మరియు ఈవి బస్సుల నిర్వహణలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు.ఆర్టీసీ సంస్థలో స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ విషయాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సానుకూలంగా స్పందించారు.ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## పండుగ పూట పసిప్రాణం బలి

- డెంగ్యూ రక్కసి కాటుకు చిన్నారి కృప మృతి
- అంత్యక్రియలకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేసిన సమ్మి గౌడ్
- ఒకే ఇంట్లో ముగ్గురు బిడ్డలకు సోకిన జ్వరం.. మందుల కోసం అప్పు పుట్టక ఆ తల్లిదండ్రుల ఆవేదన..
- అన్నదాన ప్రసాదాన్ని వదిలి.. పసిమొగ్గ పాడె మోయడానికి పరుగెత్తుకొచ్చిన సమ్మిగౌడ్ మానవత్వం



**కేసముద్రం ప్రతినిధి, మార్చి 28,తరంగాలు** : ఊరంతా రామనామ స్మరణతో మార్మోగుతుంటే.. ఆ ఇంట్లో మాత్రం కన్నవారి రోదనలు మిన్నంటాయి. లోకమంతా సీతారాముల కల్యాణ వేడుకల్లో మునిగితేలుతుంటే.. విధి వంచించిన ఆ నిరుపేద ఇంట్లో మాత్రం పసిప్రాణం గాలిలో కలిసిపోయింది. కేసముద్రం మున్సిపాలిటీ అమనాపురం హనుమంత్ రావు కాలనీలో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రతి ఒక్కరి గుండెను పిండేస్తోంది.వడ్డెరి కులానికి చెందిన రాజు, సునీత దంపతులది రెక్కాడితే గానీ డొక్కాడని బతుకు. వారికున్న ముగ్గురు కూతుళ్లు సువర్ణ, కృప, లక్ష్మిలకు ఒకేసారి డెంగ్యూ సోకింది. చేతిలో చిల్లిగవ్వ లేక, మందు బిళ్లలు కొనేందుకు అప్పు పుట్టక ఆ బిడ్డల ప్రాణాలను కాపాడుకోవడానికి ఆ తల్లిదండ్రులు పడ్డ ఆవేదన వర్ణనాతీతం. విధి ఆడిన వింత నాటకంలో సరైన వైద్యం అందక రెండో కుమార్తె కృప కన్నుమూసింది. పండుగ పూట ఇంటి దీపం ఆరిపోవడంతో ఆ తల్లిదండ్రుల కడుపుకోత ఊరంతా కన్నీరు పెట్టించింది.బిడ్డ పోయిన దుఃఖం ఒకవైపు.. కనీసం కడసారి సంస్కారాలు చేసేందుకు కూడా చేతిలో పైసల్లేని దైన్యం మరోవైపు. ఆ పసిమొగ్గను మట్టిలో కలిపేందుకు కూడా ఆ కుటుంబ పరిస్థితిని చరవాణి ద్వారా తెలుసుకున్న కాలనీ యువకులు ఎండీ . పాషా, సాంబశివరావు, సురేష్, నరేష్, పవన్, అనిల్, ఇమ్రాన్, గణేష్, హరీష్, హరిమహేష్ కంటతడి పెట్టారు.వెంటనే వారు సమాచారాన్ని సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత సమ్మయ్య దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరామనవమి సందర్భంగా తాను ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని సైతం పక్కన పెట్టి, "ఆకలి తీర్చడం కంటే ఆపదలో ఉన్న ప్రాణానికి తోడుండటం ముఖ్యం" అంటూ ఆయన వెంటనే అక్కడికి చేరుకున్నారు. తన సొంత ఖర్చులతో ఆ చిన్నారి అంత్యక్రియలు కోసం , కన్నీరు మున్నీరవుతున్న ఆ కుటుంబానికి రూ.5,000 తక్షణ సాయం అందించి పెద్ద దిక్కుగా నిలిచారు.పండుగ పూట పసిబిడ్డను పొడగొట్టుకోవడమే కాకుండా అంతిమ సంస్కారాలు కూడా చెయ్యలేని దీన పరిస్థితి లో ఉన్న ఉన్న నిరుపేద కుటుంబానికి సమాచారం ఇచ్చిన అర గంటలో దేవుడిలా వచ్చి ఆదుకున్న సమ్మయ్య గౌడ్ ను చూసి హన్మశీతరావు నగర్ కాలనీ యువకులు,స్థానికులు నిజమైన రాముడు అంటే ఇతనే" అని కొనియాడారు.



# వరంగల్ పోలీస్ రేంజ్ కార్యాలయ నూతన భవనం ప్రారంభం



- సీపీ సన్‌ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ప్రారంభం
- పరిపాలన కార్యకలాపాలకు కొత్త కేంద్రం
- పారదర్శక, బాధ్యతాయుత పనితీరుపై దిశానిర్దేశం

**వరంగల్, మార్చి 28 (తరంగాలు ప్రతినిధి):** హనుమకొండలోని సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్డుపై నిర్మించిన వరంగల్ పోలీస్ రేంజ్ పరిపాలన నూతన కార్యాలయ భవనాన్ని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శనివారం ప్రారంభించారు. ఈ భవనం ద్వారా వరంగల్ రేంజ్‌కు సంబంధించిన శాఖాపరమైన పరిపాలన కార్యకలాపాలు ఇకపై కొనసాగనున్నాయి.ప్రారంభోత్సవం అనంతరం సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించారు. అధికారులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, కార్యాలయ నిర్వహణ విధానాన్ని సమీక్షించి, పనితీరును మెరుగుపర్చే అంశాలపై సూచనలు చేశారు.ఈ సందర్భంగా సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, పోలీస్ శాఖకు సంబంధించిన సమస్యలపై రేంజ్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తక్షణ స్పందన చూపాలని ఆదేశించారు. ప్రజలకు సేవలందించే విధానంలో పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. పరిపాలనలో సమర్థత పెంపొందించేందుకు సాంకేతికత వినియోగాన్ని పెంచాలని, విభాగాల మధ్య సమన్వయం మెరుగుపరచాలని సూచించారు. కొత్త కార్యాలయం ద్వారా పనితీరు మరింత వేగవంతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీసీపీలు దార కవిత, అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ రావు, రేంజ్ కార్యాలయం సూపరింటెండెంట్ యుగేందర్, ఏసీపీలు సత్యనారాయణ, నర్సింహా రావు, సురేంద్రతో పాటు ఇతర అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మొత్తంగా ఈ నూతన భవనం ప్రారంభంతో వరంగల్ పోలీస్ రేంజ్ పరిపాలనకు మరింత బలం చేకూరి, సేవల సామర్థ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.



THARANGALU DAILY NEWS
ఆదివారం, 29 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ఘనంగా అంగన్‌వాడీ పిల్లల గ్రాడ్యుయేషన్ డే



- అంగన్‌వాడీ పిల్లల ప్రభుత్వ పాఠశాలల్లో చేరిక ప్రోత్సాహం
- ఇల్లందు ప్రభుత్వ పాఠశాలలో వైభవంగా ప్రజా పాలన వేడుకలు...



**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 28,తరంగాలు** : వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అంగన్‌వాడీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరిక చేయించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్న ఈసీసీఈ (ప్రారంభ శిశు సంరక్షణ మరియు విద్య) కార్యక్రమాల ప్రదర్శన ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా చిన్నారులు పాటలు, రైమ్స్ మరియు తమ నేర్చుకున్న విషయాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.అదేవిధంగా, అంగన్‌వాడీ పిల్లల కోసం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి, పిల్లలకు సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమం చిన్నారుల్లో ఉత్సాహాన్ని పెంపొందించింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య గురించి వివరించారు.గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య గురించి వివరించారు. అదేవిధంగా గ్రామస్థులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు.సీడీపీఓ డేబోరా మాట్లాడుతూ అంగన్‌వాడీ నుండి పాఠశాలకు మార్పు ప్రాముఖ్యతను వివరించారు బి డబ్ల్యు ఓ మాట్లాడుతూ బాలల పోషణ, విద్య మరియు సంక్షేమంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. మరియు జిల్లా కలెక్టర్ సందేశాన్ని తెలియజేస్తూ, ప్రతి అంగన్‌వాడీ చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేరేలా తల్లిదండ్రులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొచ్చు జ్యోతి యాదగిరి, ఎంఈఓ శ్రీధర్, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కార్తీక్, ప్రైమరీ స్కూలు ప్రధానోపాధ్యాయులు మురళీధర్,సూపర్వైజర్లు చంద్రకళ, లలిత, మాధవి లత, రేవతి, మౌనిక, అంగన్వాడీ టీచర్లు బేతి మాధవి, మల్లె పాక భాగ్యలక్ష్మి నేరెల్లి భారతి, అంగన్వాడీ హెల్పర్లు కవిత, సుజాత, జయ,విమల, వెంకటమ్మ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు మరియు పిల్లలు పాల్గొన్నారు.



# మూడేళ్ళ కొడుకుతో ఎస్సారెస్పీ కాలువలో దూకిన తల్లి

- గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు
- ఎన్టీఆర్ఎఫ్ బృందం తో పాటు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు
- రాత్రి వరకు ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యుల కన్నీరు మున్నీరు
- కొనసాగుతున్న గాలింపు చర్యలు



**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 28,తరంగాలు** :మూడేళ్ళ కుమారుడితో ఓ తల్లి ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విదారక సంఘటన వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి కట్ర్యాల గ్రామానికి చెందిన మేకల లింగయ్య దంపతులకు నలుగురు కుమార్తెలు చిన్న కూతురు కళ్యాణి ని స్టేషన్ ఘన్పూర్ కు ఇచ్చి వివాహం జరిపారు. 3 సంవత్సరాల కుమారుడుతో కలిసి కళ్యాణి దంపతులు వరంగల్ లో నివసిస్తున్నారు. భర్త కానిస్టేబుల్ కళ్యాణి మధ్య ఇటీవల గొడవలు జరిగినట్లు తెలిసింది. శనివారం కళ్యాణి కుమారుడితో తల్లిగారింటికి వచ్చి వారి వ్యవసాయ బావి వైపు ఉప్పరపల్లి క్రాస్ సమీపంలో ఉన్న ఎస్సారెస్పీ కాలువ వద్ద తల్లి కుమారుడు చెప్పులు బయటే ఉంచి కెనాల్లో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు గుర్తించారు. చెప్పులను గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వర్ధన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.గల్లంతయిన. కళ్యాణి,(24)కుమారుడు శ్రియన్స్ (3) ను గుర్తించేందుకు ఎన్టీఆర్ ఎఫ్ బృందం తో పాటు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రాత్రి వరకు ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నిరయ్యారు. ముక్కు పచ్చలారని కుమారుడితో తల్లి ఆత్మహత్యకు పాల్పడడంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వర్ధన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

# వేసవిలో కిడ్నీల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే ఈ సూచనలు పాటించాలి

గతేడాది కన్నా 2026లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలతో వేసవి ఉండబోతుందని భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. సాధారణంగా ఈ సమయంలో ప్రజలు చల్లగా ఉండటం, నీళ్లు ఎక్కువగా తాగడం గురించి మాత్రమే ఆలోచిస్తారు. అయితే శరీరంలో, ముఖ్యంగా కిడ్నీలలో, కనిపించని ఆరోగ్య సంక్షోభం మెల్లగా పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. అంతర్జాతీయ నెఫ్రాలజీ సంఘం గణాంకాల ప్రకారం, 2023లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 788 మిలియన్ మందికి దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి (జఖణ) ఉన్నట్లు అంచనా. భారత్‌లోనే 138 మిలియన్ మంది దీనితో బాధపడుతున్నారు. వేడి తీవ్రత పెరుగుతున్న కొద్దీ కిడ్నీ ఆరోగ్యం మౌనంగా దెబ్బతింటోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్చి నుంచి మే వరకు దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ రోజులు పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో చెమట పట్టడం, దాహం మాత్రమే కాకుండా కిడ్నీలపై పడే ఒత్తిడిని ముందుగానే గుర్తించడం అత్యవసరమని వైద్యులు తెలియజేస్తున్నారు.



### వేడి ఎక్కువగా ఉంటే..

కిడ్నీలు శరీరంలో ద్రవ సమతుల్యతను నియంత్రించడం, వ్యర్థాలను తొలగించడం, రక్తపోటును సమతుల్యం చేయడం వంటి కీలక పనులు చేస్తాయి. కానీ అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ వ్యవస్థలో అంతరాయం కలుగుతుంది. వేడి ఎక్కువగా ఉన్నప్పుడు శరీరం చల్లబడేందుకు రక్తప్రసరణను చర్మం వైపు మళ్లిస్తుంది. దీని వల్ల కిడ్నీలకు చేరే రక్తప్రవాహం తగ్గిపోతుంది. దీనిని రెనల్ హైపోపర్ఫ్యూషన్ అంటారు. ఇదే సమయంలో డీహైడ్రేషన్ కలిసివస్తే, కిడ్నీలకు ఆక్సిజన్ సరఫరా తగ్గి, విషపదార్థాలను అధికంగా ఫిల్టర్ చేయాల్సిన పరిస్థితి వస్తుంది. పరిశోధనలు సూచిస్తున్నట్లుగా, భారత్‌లో బయట పనిచేసే కార్మికుల్లో తెలియని కారణాలతో వచ్చే కిడ్నీ వ్యాధి(జఖణ) పెరుగుతోంది. దీని ప్రధాన కారణాలు నిరంతర వేడి ఒత్తిడి, తగినంత నీరు తీసుకోకపోవడమే అని నిపుణులు తెలియజేస్తున్నారు.

### వీరికి ప్రమాదం ఎక్కువ..

కొన్ని వర్గాల వారు ఎక్కువ ప్రమాదంలో ఉంటారు. వృద్ధులు దాహం గుర్తించే సామర్థ్యం తగ్గిపోవడం వల్ల ప్రమాదంలో ఉంటారు. రైతులు, కూలీలు, వీధి వ్యాపారులు వంటి బయట పనిచేసేవారు నేరుగా ఎండలో ఉండడం వల్ల ఎక్కువగా ప్రభావితమవుతారు. ఇప్పటికే హైపర్‌టెన్షన్, డయాబెటిస్ లేదా ప్రారంభ దశ కిడ్నీ సమస్యలు ఉన్నవారికి ఈ వేడి మరింత ప్రమాదకరం. వారి కిడ్నీలు అదనపు ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. కిడ్నీ ఒత్తిడికి సంబంధించిన లక్షణాలు చాలా సున్నితంగా ఉంటాయి. ఇవి సాధారణ వేసవి అలసటగా కనిపించవచ్చు. మూత్రం తగ్గిపోవడం, 6-12 గంటల పాటు మూత్ర విసర్జన లేకపోవడం ముఖ్య హెచ్చరిక. మూత్రం గాఢమైన రంగులో (గోధుమ లేదా కోక్ రంగు) కనిపించడం తీవ్రమైన డీహైడ్రేషన్ లేదా మసిల్ బ్రేక్‌డౌన్ సంకేతం కావచ్చు. కాళ్లు లేదా ముఖంలో అకస్మాత్తుగా వాపు రావడం కూడా కిడ్నీలు సరిగా పనిచేయడం లేదనే సూచన. అలాగే మానసిక గందరగోళం, చిరాకు, దిక్కుతోచకపోవడం వంటి లక్షణాలు ఎలక్ట్రోలైట్ అసమతుల్యతను సూచిస్తాయి. ఇది మెదడు, కిడ్నీల పనితీరును ప్రభావితం చేస్తుంది.

### ఈ సూచనలు పాటించాలి..

ఇక వేసవిలో కిడ్నీల సంరక్షణకు చర్యలు తీసుకోవడం చాలా అవసరం. వేసవిలో కిడ్నీ రక్షణ కోసం కేవలం నీళు తాగడం సరిపోదు. సరైన హైడ్రేషన్ వ్యూహం అవసరం. దాహం వేసే వరకు వేచి ఉండకుండా తరచూ ద్రవాలు తీసుకోవాలి. ఉప్పు మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి పానీయాలు శరీరంలో కోల్పోయిన లవణాలను భర్తీ చేస్తాయి. బయట పనిచేసేవారు ప్రతి 20 నిమిషాలకు ఒక గ్లాస్ నీరు తాగడం మంచిది. వేసవిలో ఎక్కువ నీరు కలిగిన పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. పుచ్చకాయ, తర్బూజా, ద్రాక్ష వంటి పండ్లు, దోసకాయ, సొరకాయ వంటి కూరగాయలు శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతాయి. అత్యధిక ప్రోటీన్ ఆహారాన్ని ఎండ ఎక్కువగా ఉన్న సమయాల్లో తగ్గించడం మంచిది. ఎందుకంటే ప్రోటీన్ మెటబాలిజం వల్ల నీటి అవసరం పెరిగి కిడ్నీలపై ఒత్తిడి పెరుగుతుంది. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య ఎండలో బయటకు వెళ్లడం నివారించాలి. టీ, కాఫీ, మద్యం వంటి పానీయాలు ద్రవ నష్టం పెంచుతాయి కాబట్టి పరిమితంగా తీసుకోవాలి. శరీరం వేడెక్కినప్పుడు కాళ్లను చల్లని నీటిలో ఉంచడం వంటి చిన్న మార్పులు కూడా శరీర ఉష్ణోగ్రతను తగ్గించడంలో సహాయపడతాయి. వాతావరణ మార్పులతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు కూడా మారాలి. 45 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతల సమయంలో కిడ్నీలు సులభంగా దెబ్బతినే అవకాశం ఉంది.

# రూ. 10లక్షల ఎండు గంజాయి పట్టివేత



**రాయపర్తి, మార్చి 28,తరంగాలు** : అక్రమంగా తరలిస్తున్న పదిలక్షల రూపాయల విలువైన ఎండు గంజాయిని రాయపర్తి పోలీసులు పట్టుకున్నారు.శనివారం ఉదయం వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో విశ్వసనీయ సమాచారంతో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై హెచ్ పి పంపు వద్ద ఎస్సై ముత్యం రాజేందర్ తమ సిబ్బంది తో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.ఈ క్రమంలో ఓడి 30జీ 8786 నెంబర్ గల కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు ఎండు గంజాయి తో పట్టుబడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా కలిమిల తాలూకాకు చెందిన విక్రమ్ మండేల్,గౌతమ్ మండేల్,విప్రోజిత్ మండేల్ అనే ముగ్గురు యువకులు కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు.ఈ నేపథ్యంలో సుమారు 20 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు